సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం, 27, జూన్, 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 31.216 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.924 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,433
3శాతం జీఎస్టీతో	రూ.5,596
నవర (8గ్రా)	రూ.44,768

గరిష్టం/కనిష్టం
37.5 /29.3

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 44 శాతం ఉంది. మంగళవారం ఎండ తీవ్రత తగ్గుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మైనింగ్ డాన్‌కు ముకుతాడు

లీజు గడువు ముగిసినా ఐదేళ్లుగా మైనింగ్

- పదేళ్ల కాలపరిమితితో లీజుకు తీసుకున్న భూమిలో శాశ్వత నిర్మాణాలు
- లీజు భూములు కాకుండా ఇతరుల భూముల్లోనూ తవ్వకాలు
- పెన్నానది నుంచి లక్షల టన్నుల ఇసుక అక్రమ తరలింపు
- అక్రమ రవాణా వాహనాల కింద చితికిన బతుకులు
- కళ్లు మూసుకుని వ్యవహరించిన మైనింగ్‌శాఖ అధికారులు
- అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ
- రూ.140 కోట్ల జరిమానా

పాతికేళ్ల క్రితం అతనో కామర్స్ అధ్యాపకుడు. తాను ఉండే ఇంటికి అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి. అనంతరం రాజకీయాల్లోకి వచ్చి.. జలదంకి ఎంపీపీగా ఎన్నికై మైనింగ్ డాన్‌గా ఎదిగాడు. రియల్ ఎస్టేట్ నుంచి క్వారీలు, క్రషర్లు, కాంక్రీట్ మిక్సర్లు పెట్టి అడ్డదారులు తొక్కుతూ అతి తక్కువ కాలంలోనే వేల కోట్లకు అధిపతి అయ్యాడు. ఆయనే గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ యజమాని డీవీ కృష్ణారెడ్డి అలియాస్ కావ్య కృష్ణారెడ్డి. ఇన్నాళ్లు తెరచాటుగా సాగిస్తున్న అతని అవినీతి బాగోతం ఇటీవల సమాచారహక్కు చట్టంతో బయటపడింది. 'స్పందన' ఫిర్యాదుతో వెలుగుచూసింది. రాష్ట్ర ప్రభుత్వం అతని అక్రమాలపై విచారణ జరిపి రూ.140 కోట్ల జరిమానా విధించి ఆ మైనింగ్ డాన్ దురాగతాలకు ముకుతాడు వేసింది.



జలదంకి మండలం గట్టుపల్లిలో కొండ ప్రాంతాన్ని భారీగా తవ్విన దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జలదంకి మండలానికి చెందిన గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ యజమాని డీవీ కృష్ణారెడ్డి అలియాస్ కావ్య కృష్ణారెడ్డి 2008లో రోడ్డు మెటల్ పేరుతో లీజుకు తీసుకున్న క్వారీలే అడ్డాగా సమీపంలోని అనధికార భూముల్లో మెటల్ తవ్వేసి వందల కోట్ల రూపాయల దోపిడీకి తెరతీశాడు. పదేళ్ల కాలపరిమితికి లీజుకు తీసుకుని గడువు ముగిసి ఐదేళ్లు దాటిపోయినా యథేచ్ఛగా మైనింగ్ చేస్తున్నాడు. క్వారీ మైనింగ్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్లు, కూలీల నివాసాలు, పెట్రోల్ బంకుల వంటివి ఏర్పాటు చేశాడు.

అక్రమాలను తరచి చూస్తే..

గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ పేరు మీద డీవీ కృష్ణారెడ్డి, డి.కవిత పేరుతో జలదంకి మండలం గట్టుపల్లిలో సర్వేనంబర్ 1015లో 9.47 ఎకరాల భూమిని రోడ్డు మెటల్ తవ్వకానికి పదేళ్ల కాలపరిమితితో (26.02.2008 నుంచి 25.02.2018) మైనింగ్ లీజు హక్కులు పొందాడు. అదే మండలం అన్నవరంలో సర్వేనంబర్ 851/2బీలో 5.36 ఎకరాల భూమిని రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ పేరుతో రోడ్డు మెటల్ తవ్వకానికి 10 ఏళ్ల కాలపరిమితితో (26.02.2008 నుంచి 25.02.2018) మైనింగ్ లీజు హక్కులు పొందాడు. అయితే గట్టుపల్లి క్వారీలో టన్ను మెటల్ కూడా తవ్వకుండా అక్కడే క్రషర్లు, పెట్రోల్ బంకు, కూలీల నివాస భవనాలు, కార్యాలయం వంటివి ఏర్పాటు చేశాడు. అయితే ఈ క్వారీ నుంచి 28 వేల క్యూబిక్ మీటర్ల మెటల్ రవాణాకు పర్మిట్లు జారీ చేయడం గమనార్హం. ఈ క్వారీకి సంబంధించి పదేళ్ల లీజు కాలపరిమితి 2018 ఫిబ్రవరి 25వ తేదీ నాటికే పూర్తయితే 15 ఏళ్ల లీజు కాలపరిమితి పెంచమని ప్రతిపాదిస్తూ దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అది మైనింగ్‌శాఖ వద్ద పరిశీలనలో ఉండడంతో ఆ లీజు కొనసాగుతూనే ఉంది. గట్టుపల్లి క్వారీ పక్కనే ఉన్న ఇతరుల భూములు, ప్రభుత్వ భూముల్లో సుమారు 7 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను అక్రమంగా తవ్వేసినట్లు ఇటీవల మైనింగ్‌శాఖ తనిఖీల్లో బట్టబయలైంది. అన్నవరం క్వారీకి లీజు గడువు పెంచమనే అభ్యర్థనను కూడా మైనింగ్ శాఖ తిరస్కరించింది. అన్నవరం క్వారీతోపాటు పక్కనే ఉన్న భూముల్లో కూడా అక్రమంగా మైనింగ్ చేపట్టి 5 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను తవ్వేసినట్లు వెలుగుచూసింది. ఈ క్వారీ లీజు గడువు ముగిసినప్పటికీ గత ఐదేళ్లుగా గట్టుపల్లి క్వారీ పర్మిట్‌తోనే విచ్చలవిడిగా మైనింగ్ చేపట్టాడు. మొత్తంగా 12 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను అక్రమంగా తవ్వినట్లు మైనింగ్ శాఖ లెక్కలు తేల్చింది. అక్రమంగా తవ్వేసిన మెటల్ విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.200 కోట్లు ఉంటుందని, మార్కెట్ ధర ప్రకారం రూ.600 కోట్లు ఉంటుందని అంచనా. కావ్య కృష్ణారెడ్డి అక్రమాలపై స్థానికులు సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేయడంతో అసలు విషయాలు బయటకు వచ్చాయి. వీటి ఆధారంగా సదరు వ్యక్తులు 'స్పందన'లో ఫిర్యాదు చేయడంతో అక్రమాల బాగోతం బయటపడింది.

కరెంట్ బిల్లు ఆధారంగా..

గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్, రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ పేరుతో తీసుకున్న లీజు క్వారీల్లో అక్రమ మైనింగ్ జరగలేదని తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం కూడా బెడిసికొట్టింది. క్రషర్లకు వినియోగించిన కరెంట్ బిల్లుల ఆధారంగా లెక్కలు తీయగా, 89 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగించినట్లు తేలింది. టన్ను మెటల్ ప్రాసెస్ చేయడానికి 2.5 యూనిట్లు ఖర్చవుతుందని, ఆ మేరకు 12 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను అక్రమంగా తవ్వేసినట్లు నిర్ధారించారు.



మైపాడుకు వెళ్లే రోడ్డులోని గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్

చితికిన ప్రాణాలు

అక్రమ మైనింగ్ వాహనాల కింద పడి పదేళ్ల కాలంలో పలువురు మృతిచెందినట్లు తెలుస్తోంది. నిత్యం వందలాది వాహనాల్లో రోడ్‌మెటల్ నుంచి పెద్ద బండరాళ్లు, కంకర, మట్టి లాంటి సహజ వనరులను లూటీ చేశారు. ఈ అక్రమ రవాణా వాహనాల కింద పడి పలువురు ప్రాణాలు కోల్పోయినా ఎలాంటి కేసులు లేకుండా భయపెట్టి రాజీచేసి పంపించేవారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనధికార బ్లాస్టింగ్‌లు చేస్తూ ఊరినే వణికిస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారులను ప్రలోభపెట్టి..

అక్రమ మైనింగ్‌కు స్థానిక రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల సహకారం ఉన్నట్లు ఆ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతి లేని అక్రమ మైనింగ్‌పై ఎన్నోమార్లు ఫిర్యాదులు చేసినా స్పందించిన దాఖలాలు లేవని చెబుతున్నారు. ఈ అక్రమాల గురించి ప్రశ్నించిన వారిపై దాడులు చేయించడంతోపాటు ఇళ్లకు వెళ్లి బెదిరించేవారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా మధ్యస్తం చేసి పంపేవారని స్థానికులు పేర్కొంటున్నారు.

గురు రాఘవేంద్ర కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్లతో..

డీవీ కృష్ణారెడ్డి అక్రమాల దందా ఈనాటి కాదు. కొన్నేళ్ల క్రితమే నెల్లూరు పెన్నానది, నాయుడుపేటలోని స్వర్ణముఖి నదీతీరంలో గురు రాఘవేంద్ర కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్లు ఏర్పాట్లు చేసి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఈ యూనిట్‌కు కంకర, సిమెంట్ కొనుగోలు చేసినా.. ఇసుకను మాత్రం నదీ తీరాల్లోనిదే వాడినట్లు సమాచారం. ఈ రెండు ప్లాంట్ల నుంచి నిత్యం వందల ట్యాంకర్ల కాంక్రీట్ మిక్సింగ్ వ్యాపారం జరిగిందని తెలుస్తోంది. గతంలో ఇసుక ఉచితంగా ఉండడంతో రూపాయి ఖర్చు లేకుండా నదీతీరాలను తవ్వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ఇసుక పాలసీ అమలు చేసి ధర నిర్ణయించింది. అయితే గురు రాఘవేంద్ర కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్లలో ఈ నాలుగేళ్లలో ఎంత ఇసుక వినియోగించారు.. ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే వివరాలను పరిశీలిస్తే అందులోని అక్రమాలు కూడా బట్టబయలయ్యే అవకాశం ఉంది. ఈ రెండు క్రషర్ల వద్ద కరెంట్ వినియోగాన్ని లెక్కిస్తే మరికొన్ని నిజాలు కూడా వెలుగుచూసే అవకాశం ఉంది.

'జగనన్నకు చెబుదాం' ద్వారా వెలుగులోకి..

గత ప్రభుత్వాల నేతలు, అధికారుల అండదండలతో చెలరేగిన ఈ మైనింగ్ డాన్ అక్రమాలకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా చెక్ పడిందనే చెప్పాలి. ఈ అక్రమ మైనింగ్‌పై గట్టుపల్లి గ్రామస్తులు 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. విజయవాడ నుంచి వచ్చిన మైనింగ్‌శాఖ అధికారులు తనిఖీలు చేయగా విస్తుబోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అనుమతులు లేకుండానే వేల కోట్ల విలువైన సహజ వనరులను దోచుకున్నట్లు గుర్తించి రూ.140 కోట్లు జరిమానా విధించారు.

అక్రమాలపై తొమ్మిదేళ్లుగా పోరాటం



గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్ యజమాని డీవీ కృష్ణారెడ్డి ఎన్నో ఏళ్లుగా సహజ వనరులను దోచుకుంటున్నాడు. అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్లు సంపాదించాడు. మా గట్టుపల్లి పంచాయతీలో సహజ వనరులు దోచుకుంటున్నా ఒక్క రూపాయి కూడా పంచాయతీకి సీనరేజ్ చెల్లించేవాడు కాదు. అతని అక్రమాలపై తొమ్మిదేళ్లుగా పోరాటం చేస్తున్నా. అక్రమాలను ప్రశ్నించినందుకు మా కుటుంబంపై దాడులు చేయించాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నా తొమ్మిదేళ్ల పోరాటానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం మద్దతుగా నిలిచింది. విచారణ జరిపి జరిమానా విధించడం ద్వారా అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్టపడింది.

– గుమ్మలపాటి సుబ్బారావు, ఉప సర్పంచ్, గట్టుపల్లి

ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాం



గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ ద్వారా గట్టుపల్లి పంచాయతీలో దోపిడీ చేస్తున్నారు. అనుమతులు లేకుండా సహజ వనరులను దోచుకుంటున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గ్రామస్తులు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాం.

– దివి నరేంద్రచౌదరి, గట్టుపల్లి, జలదంకి మండలం

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడండి

- ఎస్పీని కోరిన మహిళా కమిషన్ సభ్యురాలు



ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గజ్జల లక్ష్మి

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లాలో జరిగిన పలు కేసులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆమె ఎస్పీని కోరారు. అనంతరం దిశ వన్‌స్టాప్ సెంటర్(సఖి)ను, దిశ పోలీసుస్టేషన్‌ను సందర్శించి మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశచట్టం, దిశయాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా ప్రాంగణంలో ఆశావర్కర్ల శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సేవాసదన్‌ను సందర్శించి బాలికలకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

రంగనాథుడిని దర్శించుకున్న లక్ష్మీపార్వతి



లక్ష్మీపార్వతికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.శివకుమార్‌ఆచారి ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న లక్ష్మీపార్వతికి ప్రధానార్చకుడు కిడాంబి జగన్నాథాచార్యులు, అర్చకులు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదాశీర్వచనాలతో స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో 10 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని ఆ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షకు 7,662 మంది విద్యార్థులకు గాను 7,161 మంది హాజరయ్యారని, 501 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సంగంలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షకు 7,645 మంది విద్యార్థులకు గాను 6,925 మంది హాజరయ్యారని, 720 మంది గైర్హాజరయ్యారని, అలాగే వివిధ పరీక్ష కేంద్రాల్లో 9 మంది డిబార్ అయ్యారని తెలిపారు.

తహసీల్దార్ల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని మూడు మండలాలకు నూతనంగా తహసీల్దార్‌లను నియమిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముత్తుకూరు మండల తహసీల్దార్‌గా ఉన్న సురేష్ ఒంగోలుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎల్.బాలకృష్ణను, చేజర్ల తహసీల్దార్‌గా ఉన్న శివకృష్ణను మనుబోలుకు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఎం.హరిబాబును, అలాగే లింగసముద్రం మండల తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ స్థానంలో షేక్ మీరావలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

27న భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(సెంట్రల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ, నెల్లూరు ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ అమితాబ్ శుక్లా, ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలిలోని జవహర్ భారతి కళాశాలలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం తెచ్చిన తంటా

- వెంగాయగారిపాళెంలో టీడీపీ వర్గాల పరస్పర దాడులు
- 9 మందికి తీవ్రగాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న నాగరాజు

కావలి రూరల్: కావలి రూరల్ మండలం వెంగాయగారిపాళెం గ్రామంలో టీడీపీకి చెందిన ఇరువర్గాలు సోమవారం రాత్రి ఒకరిపై ఒకరు కత్తులు, కర్రలతో దాడులు చేసుకోవడంతో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల వివరాల మేరకు గ్రామంలో కొంత కాలంగా మాతిన నాగరాజు మద్యం అమ్ముతుండేవాడు. మద్యం తాగిన వ్యక్తులు రోడ్లపై అల్లరి చేస్తుండటంతో గ్రామస్తులు మద్యం అమ్మకాలు నిలుపుదల చేయాలని కోరారు. అయితే నాగరాజు తిరునాళ్లకు నా వంతుగా కొంత డబ్బులు ఇస్తానని, మద్యం అమ్మకాలు చేసుకోనివ్వాలని కోరడంతో గ్రామస్తులు ఒప్పుకోలేదు. ఈ క్రమంలో నాగరాజు కొడుకు మల్లికార్జునకు గ్రామంలోని కొందరు యువకులకు విభేదాలు ఏర్పడి పరస్పరం దాడులకు దిగారు. ఈ దాడుల్లో జంపాని మునలయ్య, జంపాని ప్రసాద్, జంపాని అరుణ, మాతిన పెద్ద వెంకయ్య, మాతిన సుజాత, మాతిన నాగరాజు, మాతిన శ్రీనివాసులు, మాతిన రామసుబ్బయ్య, మాతిన శ్రీహరిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. జంపాని మునలయ్య, మాతిన సుజాతలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు 1వ పట్టణ పోలీసులు తెలిపారు.

ఆధిపత్య పోరుతో అయోమయం

కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది. ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం అటుంచి ముందు పార్టీలో నెలకొన్న గ్రూపు తగాదాలతో నిండా మునిగి తేలుతోంది. పార్టీలో ఉన్న నాయకులు ఎవరి బలాన్ని వాళ్లు పెంచుకునే పనిలో పడడంలో ఆ పార్టీ కార్యకర్తలు పూర్తిగా అయోమయ స్థితిలో ఉన్నారు.

- కందుకూరులో టీడీపీ పరిస్థితి
- ఇంటూరి బ్రదర్స్ మధ్య విభేదాలు
- పార్టీ ఇన్‌చార్జి నాగేశ్వరరావుకు దీటుగా సొంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజేష్
- సోదరుడు నాగేశ్వరరావుకు టికెట్ ఇస్తే ఓడిస్తానంటున్న రాజేష్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రస్తుతం కందుకూరులో టీడీపీ నేతలైన ఇంటూరి బ్రదర్స్ మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు పార్టీకి తలనొప్పిగా మారింది. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న ఇంటూరి నాగేశ్వరరావును వరుసకు సోదరుడైన ఇంటూరి రాజేష్ వ్యతిరేకిస్తుండడమే ఇందుకు కారణం. వీరిద్దరి ఆధిపత్య పోరుతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఈ పరిస్థితుల్లో సీనియర్ నాయకుడు దివి శివరాం, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు అడపాదడపా నియోజకవర్గంలో పర్యటిస్తూ తమ ఉనికిని చాటుకునే పనిలో ఉన్నారు. దీంతో అసలు పార్టీలో ఏం జరుగుతుందో సామాన్య కార్యకర్త అర్థం కాని పరిస్థితి.

టీడీపీ ఉనికి ప్రశ్నార్థకం

ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్ ఇద్దరూ ఒకే గ్రామానికి చెందినవారు. ఇద్దరి మధ్య సోదర బంధుత్వం ఉన్నా రాజకీయంగా మాత్రం పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. దీనికి ప్రధాన కారణం ఆధిపత్య పోరు అని తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో ఓటమి తరువాత నియోజకవర్గంలో టీడీపీ ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితుల్లో సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం అండతో వలేటివారిపాళెం బడేవారిపాళెం గ్రామానికి చెందిన రియల్టర్ ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. అయితే అంతకుముందు నుంచే అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు సోదరుడు రాజేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండడంతోపాటు ఆర్థికంగా ఖర్చు పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో తనను మోసం చేసి నాగేశ్వరరావు దొడ్డిదారిలో ఇన్‌చార్జి పదవి తెచ్చుకున్నాడని రాజేష్ రగిలిపోయాడు. ఈ వైరం ప్రస్తుతం తారస్థాయికి చేరింది. స్వయంగా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఇద్దరూ కలిసి పనిచేయాలని ఆదేశించినా ససేమిరా అంటున్నారు. పార్టీ అధికారిక కార్యక్రమాలను నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, వాటిలో పాల్గొనేందుకు రాజేష్ ఇష్టపడడం లేదు. తాను సొంతంగా నియోజకవర్గంలో పర్యటిస్తూ తన వర్గాన్ని పెంచుకునే పనిలో రాజేష్ ఉన్నాడు.

అగమ్యగోచరం

నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నా నాయకుల మధ్య ఆధిపత్య పోరు మాత్రం తగ్గడం లేదు. పార్టీ అధిష్టానం నాగేశ్వరరావుకు టికెట్ ఇస్తే ఓడించేందుకు కూడా వెనుకాడేది లేదని రాజేష్ తన వర్గం నాయకులతో స్పష్టం చేస్తున్నారు. వీరి మధ్య పోరు ఇలా ఉంటే 2019 ఎన్నికల ఓటమి తరువాత నియోజకవర్గానికి దూరమైన మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు అప్పుడప్పుడూ నియోజకవర్గంలో పర్యటిస్తూ అధిష్టానం టికెట్ ఇస్తే మరోసారి పోటీ చేసేందుకు సిద్ధమేనని తనవర్గం నాయకుల వద్ద చెప్పుకుంటున్నారు. దీంతో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



వైఎస్సార్ 'లా నేస్తం' కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్, యువ న్యాయవాదులు

యువ న్యాయవాదులు ఉన్నతంగా ఎదగాలి

- 'లా నేస్తం' కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'లా నేస్తం' పేరుతో ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని యువ న్యాయవాదులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. లా కోర్సు పూర్తి చేసి యువ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, ప్రాక్టీస్ సమయంలో ప్రోత్సాహంగా వారికి ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు మూడేళ్లపాటు ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ లా నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించగా, నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీసీ హాలు నుంచి కలెక్టర్, యువ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా లా కోర్సు పూర్తి చేసిన యువ న్యాయవాదులకు ప్రాక్టీస్ సమయంలో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా రూ.5 వేల చొప్పున 2019 నవంబర్ నుంచి క్రమం తప్పకుండా ముఖ్యమంత్రి అందిస్తున్నారన్నారు. యువ న్యాయవాదికి ఒక సంవత్సరానికి రూ.60 వేల చొప్పున మూడేళ్లపాటు రూ.1.80 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. యువ న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాక్టీస్‌లో బాగా రాణించి పేదలకు మెరుగైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 2,677 మంది యువ న్యాయవాదులకు రూ.6.12 కోట్లు అందించారని తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

'లా నేస్తం'తో భరోసా



గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'లా నేస్తం' అమలు చేస్తున్నారు. 'లా నేస్తం' యువ న్యాయవాదులకు భరోసా నిస్తోంది. తద్వారా న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకునే అవకాశం లభించింది. ప్రభుత్వం నెలకు రూ.5 వేల చొప్పున అందిస్తోంది.

– జాహ్నవి, యువ న్యాయవాది, అల్లీపురం

ఆర్థిక సమస్యలు అధిగమించొచ్చు



'లా నేస్తం' ద్వారా న్యాయవాద వృత్తి ప్రారంభ దశలో ఎదురయ్యే ఆర్థిక సమస్యలు అధిగమించేందుకు ధైర్యం వచ్చింది. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం యువ న్యాయవాదులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఇసనాకుల ప్రశాంతి, యువ న్యాయవాది, బాలాజీనగర్, నెల్లూరు

దేవుడి సొమ్మే కదా.. లెక్కే లేదు

ఆ ఆలయాలకు దాతలు విరాళంగా ఇచ్చిన రూ.కోట్ల విలువైన భూములున్నాయి. ప్రతి సంవత్సరం కౌలుకు ఇస్తుంటారు. దేవుడి సొమ్మే కదా.. మనల్ని ఎవరడుగుతారులే అనే రీతిలో కౌలుదారులు వ్యవహరిస్తున్నారు. దీనికితోడు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. పర్యవేక్షణ కరువైంది. ఈ నేపథ్యంలో అర్చకులు జీతాలకు నోచుకోవడం లేదు.

- ఆలయాలకు రూ.కోట్లలో ఆస్తులు
- ఏడాదికి రూ.లక్షల్లో కౌలు
- కౌలు నగదు ఎగ్గొడుతున్న పాటదారులు
- ఇష్టారాజ్యంగా నిధుల ఖర్చు
- నెలల తరబడి అర్చకులకు జీతాల్లేవు

చేజర్లలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయం



ఆత్మకూరు: మండల కేంద్రమైన చేజర్లలోని కామాక్షి సమేత నీలకంఠేశ్వర ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ గుడికి 20 ఎకరాలకుపైగా భూములున్నాయి. అదే క్రమంలో గ్రామంలోని లక్ష్మీసమేత చెన్నకేశ్వర ఆలయానికి సర్వే నంబర్ 704, 706, 795/2 తదితర సర్వే నంబర్లలో మడపల్లి గ్రామంలో 18 ఎకరాలకుపైగా భూములున్నాయి. ఈ రెండు గుడుల భూములను ఒక కుటుంబం వారే రెండేళ్ల క్రితం వేలంపాటలో దక్కించుకున్నారు. ఇందులో భాగంగా ఏడాదికి సుమారు రూ.5.10 లక్షల కౌలు చెల్లించాలి. మడపల్లిలో పెన్నా తీరంలో ఉన్న ఈ భూములు సారవంతమైనవి. ఒక ఏడాదికి సంబంధించిన నగదు మాత్రం చెల్లించారు. ఆ తర్వాత పంటలు సక్రమంగా పండటం లేదనే సాకుతో కౌలు మొత్తాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాడు. అధికారులతో కుమ్మక్కై రూ.2 లక్షలకు కౌలు మొత్తాన్ని తగ్గించుకున్నట్లు చెబుతున్నారు. సదరు భూముల్లో ఎకరా లేదా రెండు ఎకరాలు చదరంగా లేక కొంత దిగుబడి తగ్గుతుందని స్థానికులు అంటున్నారు.

జీతాలివ్వకుండా..

నీలకంఠేశ్వర ఆలయం పూజారికి 22 నెలలుగా, చెన్నకేశవ స్వామి ఆలయ పూజారికి 18 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీనికితోడు 'పడితరం' (నైవేద్య పదార్థాలు)కు అదనంగా చెల్లించాల్సి ఉన్నా ఆ పూజారులకు నెలకు నిర్ణయించిన రూ.10వేల జీతంలోనే వినియోగించుకోవాలని దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు.

ఇక్కడిలా..

సంగంలోని ప్రముఖ పురాతన సంగమేశ్వర ఆలయానికి సుమారు 280 ఎకరాలకుపైగా భూములున్నాయి. కౌలు వస్తున్నా అక్కడి పూజారికి నాలుగేళ్లుగా జీతం ఇవ్వడం లేదు. అదే విధంగా వంగల్లు గ్రామంలో వెలసిన కామాక్షి సమేత భీమేశ్వర ఆలయానికి భూములున్నా ఏటా కౌలు వస్తున్నా పూజారికి ఏడాది కాలంగా జీతం ఇవ్వడం లేదు.

ఇష్టారాజ్యంగా ఖర్చు

చేజర్లలోని నీలకంఠేశ్వర ఆలయానికి రెండేళ్ల క్రితం వరకు రూ.4.80 లక్షలకుపైగా నగదు బ్యాంక్‌లో నిల్వ ఉండేది. అయితే ఆలయానికి, ధ్వజస్తంభానికి కొద్దిపాటి మరమ్మతులు, ఉత్సవాల నిర్వహణ తదితర వాటికి ఆ నిధులను పూర్తిగా వాడేశారు. వాస్తవానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే సమయంలో దాతల సహకారం తీసుకుంటుంటారు. ఆ ప్రయత్నం జరగలేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలున్నా..

కౌలు ఏ ఏడాదికి ఆ ఏడాది ముందుగానే పాటదారులు చెల్లిస్తారు. అయినా అర్చకులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంపై విమర్శలున్నాయి. భూములను వేలం వేసే క్రమంలో వరి పండిస్తే ఒకలా, వాణిజ్య పంటలైన పత్తి, మిరప సాగు చేస్తే మరోలా కౌలు చెల్లించాలని దేవదాయ శాఖ చట్టంలో ఉంది. అయితే ప్రస్తుతం కౌలుదారులు అన్ని రకాల పంటలు సంవత్సరం మొత్తం పండించుకుంటూనే.. నష్టం వస్తోందని సాకులు చెబుతూ కౌలు తగ్గించి చెల్లిస్తున్నారని తెలుస్తోంది. కాగా ఆ శాఖ అధికారులు కొందరు మామూళ్ల మత్తులో కౌలుదారులకే వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలున్నాయి. రికార్డులు సక్రమంగా ఉండడంలేదు. ముఖ్యంగా గ్రూప్ టెంపుల్స్ (సామూహిక దేవాలయాలు) పరిధిలో ఇలాంటి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

ఏళ్ల తరబడి పనిచేస్తున్నాం



నేను నాలుగు దశాబ్దాలుగా దేవుడి సేవ చేస్తున్నా. 18 నెలలుగా జీతాలు చెల్లించడంలేదు. అడిగితే ఆలయ భూముల కౌలు నగదు రాలేదని, రాగానే చెల్లిస్తామని చెబుతున్నారు.

– నారాయణం అనంత కృష్ణమాచార్యులు, చెన్నకేశవ ఆలయ పూజారి, చేజర్ల

22 నెలలుగా జీతం రాలేదు



నాకు పడితరంతో కలిపి నెలకు రూ.10 వేలు జీతం ఇస్తారు. అయితే 22 నెలలుగా ఆ జీతం కూడా ఇవ్వడం లేదు. పలుమార్లు జిల్లా అధికారులను అడిగినా ఫలితం లేదు.

– పణతుల కోటేశ్వరరావు, నీలకంఠేశ్వర ఆలయ పూజారి, చేజర్ల

కౌలు సక్రమంగా రావడం లేదు

ఆలయాల పూజారులకు జీతాలు చెల్లించకపోవడం వాస్తవమే. కౌలుదారులు సక్రమంగా నగదు చెల్లించకపోవడంతో వారికి జీతాలు ఇవ్వలేదు. చేజర్ల ఆలయాల భూములను త్వరలో మళ్లీ కౌలు వేలం వేయనున్నాం. నగదు అందిన వెంటనే పూజారులకు చెల్లిస్తాం.

– కె.పెంచలవరప్రసాద్, గ్రూపు దేవాలయాల ఈఓ

జీతాలు చెల్లించేలా చూస్తా

పలు మండలాల్లో దేవదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల్లో పూజారులకు జీతాలు ఇవ్వడంలేదన్న విషయం నా దృష్టికి వచ్చింది. అర్చక పరిషత్ జిల్లాస్థాయి సమావేశాన్ని ఆయా అర్చకులతో కలిసి నిర్వహించి త్వరలోనే వారికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటా. భూముల విషయం పూర్తిస్థాయిలో పరిశీలించి తప్పిదాలు జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎండోమెంట్ కమిషనర్, నెల్లూరు

సఖి సంరక్షణలో ప్రకాశం జిల్లా యువతి

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో నుంచి వచ్చేసిన యువతి సఖి సిబ్బంది సంరక్షణలో ఉంది. వారు యువతి వివరాలు సేకరించి ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కొండేపికి చెందిన ఓ యువతి ఆదివారం రాత్రి నెల్లూరుకు చేరుకుంది. ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుగుతుండగా ఉద్యోగి వెంకటేశ్వర్లు దిశ ఎస్‌ఓఎస్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. చిన్నబజారు పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని సదరు యువతిని విచారించగా నెల్లూరులోని బంధువుల ఇంటికి వచ్చానని, వారి అడ్రస్ మరిచిపోయానని, తీసుకెళ్తామన్న బంధువులు రాలేదని తెలిపింది. దీంతో పోలీసులు ఆ యువతిని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో అప్పగించారు. అధికారులు ఆమెను విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:143
లేయర్ (లైవ్)	:108
బ్రాయిలర్ చికెన్	:244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:272
లేయర్ చికెన్	:184

బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ ఎన్ఆర్‌టీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సులుగా అవకాశాలు ఉన్నాయని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సి.విజయ్ వినీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 20–35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. సాధారణ ఆస్పత్రిలో రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం, జర్మన్ భాష నేర్చుకునేందుకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు. భాషపై శిక్షణకు ఉచిత ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. బీ–1 స్థాయి ఉత్తీర్ణత సాధించిన తర్వాత జర్మనీలో పనిచేయడానికి ఆఫర్ లెటర్ ఇస్తారన్నారు. అవసరమైన పత్రాలు, రెజ్యూమ్, ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు విమాన చార్జీలు ఉచితమన్నారు. దీంతోపాటు భోజనం, వసతి, మొదటి ఆరునెలలపాటు నెలకు వెయ్యి యూరోల చొప్పున అందిస్తారని తెలిపారు. తర్వాత ఆరునెలలపాటు జర్మనీలో బీ–2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారని తెలియజేశారు. ఈనెల 30వ తేదీలోగా www.apssdc.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీలను పరిశీలించండి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం'లో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపాలి.' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో హరినారాయణన్, జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీపీఓ సుస్మితారెడ్డి సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రీ ఓపెన్‌కు అవకాశం లేకుండా పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష ఒకదానికొకటి అనుబంధ కార్యక్రమాలన్నారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే టీంలు అర్జీదారులను కలిసి పరిష్కరించింది.. లేనిది తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ బి.చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్, రమేష్‌నాథ్, డీఈఓ గంగాభవానీ, మెప్మా పీడీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

- వివిధ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు.
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్‌ల్లో ఖాళీగా ఉన్న లస్కర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని బీజేపీ నవామీ గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

బాబు, పవన్ పగటి వేషగాళ్లు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు): 'చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పగటి వేషగాళ్లు. ప్రజలను మభ్యపెట్టేందుకు వారు రకరకాల యాత్రలు చేస్తున్నారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం విడవలూరులో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు పవన్‌కు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కనిపించడం లేదన్నారు. అనేక పథకాల ద్వారా పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, అందువల్లే వారి పాలనకు చరమగీతం పాడారన్నారు. సీఎం జగన్ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఏడాదిపాటు ఎమ్మెల్యేలు ప్రతి గడపలో వారికి తాము చేసిన మేలు, వారికి ఇంకేమి అవసరమో తెలుసుకునే కార్యక్రమం చేపట్టడం చరిత్రలో నిలిచిపోయే అంశమన్నారు. ఈ విషయాన్ని పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రు లు సైతం తెలుసుకుని హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలులో కావలి వైద్య విద్యార్థి ఆత్మహత్య



లోకేశ్ (ఫైల్)

కావలి: పట్టణంలోని పాతూరు పుచ్చలపల్లివీధికి చెందిన దింటకుర్తి లోకేశ్ (21) కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాల హాస్టల్‌లో సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. బ్రహ్మానందరావు అనే వ్యక్తి టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య గృహిణి. వారి పిల్లల్లో ఒకరైన లోకేశ్ విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె హైదరాబాద్‌లో ఆయుర్వేద డాక్టర్‌గా పనిచేస్తున్నారు. బ్రహ్మానందరావుది మధ్య తరగతి కుటుంబం. ఎంతో కష్టపడి కొడుకును చదివిస్తున్నాడు. వైద్యుడిగా చేతికి అందివస్తాడనుకున్న తరుణంలో లోకేశ్ ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి తల్లిదండ్రులతోపాటు బంధువులు కర్నూలుకు తరలివెళ్లారు.

ధైర్యంగా ఉండండి.. న్యాయం చేస్తాం

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
- పోలీస్ స్పందనకు 106 వినతులు

నెల్లూరు(క్రైమ్): 'ధైర్యం కోల్పోవద్దు. మీ వినతిని పరిశీలించి పోలీస్ శాఖ నుంచి తగిన న్యాయం చేస్తాం.' అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అర్జీదారులకు భరోసా కల్పించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. 106 మంది తమ సమస్యలపై వినతి పత్రాలను ఎస్పీతోపాటు, ఏఎస్పీ డి.హిమవతికి అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెడికల్ సీట్లు ఇప్పిస్తానని, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి మాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అనంతరం అర్జీదారులకు భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్య వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఎంబీబీఎస్ సీట్ ఇప్పిస్తానని మోసగించారు

నా కుమార్తెకు ఎంబీబీఎస్ సీట్ ఇప్పిస్తానని బీవీ నగర్‌కు చెందిన విజయ్‌కుమార్ నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి రూ.3.72 కోట్లు ఇచ్చాం. నెలలు గడుస్తున్నా సీట్ ఇప్పించలేదు. అడిగితే మళ్లీ ఇస్తానంటూ కాలయాపన చేస్తున్నాడు. మాకు న్యాయం చేయండి.

– పద్మనాభయ్య, బీవీ నగర్

ఉద్యోగం పేరిట మోసం

నా కుమారుడు ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగం ఇప్పిస్తానని కావలికి చెందిన కృష్ణారెడ్డి రూ.2.50 లక్షల నగదు తీసుకున్నాడు. ఇప్పుడు సమాధానం చెప్పడం లేదు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలి.

– వెంకటప్రసాద్, కావలి

గేదెలు ఢీకొని మహిళ మృతి

కలిగిరి: మండలంలోని వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాళెంలో గేదెలు ఢీకొని కర్ణం నారాయణమ్మ (59) అనే మహిళ సోమవారం మృతిచెందింది. స్థానికుల కథనం మేరకు.. నారాయణమ్మ తన గేదెలను పొలానికి తోలుకెళ్తోంది. ప్రధాన రోడ్డుపై వెళ్తుండగా వేరే వ్యక్తికి చెందిన గేదెలు వెనుక నుంచి ఆమెను ఢీకొన్నాయి. దీంతో సిమెంట్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే కలిగిరిలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. నారాయణమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలున్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

- రేకులు పగులగొట్టి రూ.7 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వ మద్యం దుకాణంలోని నగదు చోరీ చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున పడారుపల్లి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పడారుపల్లి సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. రోజూ విక్రయాలకు సంబంధించిన నగదును సిబ్బంది మరుసటిరోజు బ్యాంక్‌లో జమ చేస్తుంటారు. అయితే శని, ఆదివారాలు బ్యాంక్‌కు సెలవు. దీంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు విక్రయ తాలూకా నగదు సుమారు రూ.7 లక్షలను దుకాణంలోని చెస్ట్‌లో భద్రపరిచారు. తాళం చెవిని దుకాణంలోనే పెట్టారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే దుకాణాన్ని మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు దుకాణంపై రేకులను పగులగొట్టి లోనికి ప్రవేశించి నగదు చోరీ చేశారు. ఉదయం సేల్స్‌బాయ్ సురేష్ దుకాణం తెరవగా రేకులు పగిలి ఉండడం, చెస్ట్ తెరిచి ఉంది. అందులోని రూ.7 లక్షలు కనిపించలేదు. దీంతో సురేష్ జరిగిన విషయాన్ని ఎక్సైజ్ అధికారులకు తెలియజేశారు. ఎక్సైజ్ సీఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుకాణం మూసివేసిన తర్వాత చెస్ట్ తాళం సిబ్బంది తమ వెంట తీసుకెళ్లాలి. అయితే అక్కడే ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. సేల్స్‌మన్ ఫిర్యాదు మేరకు పోలీసులు విభిన్న కోణాల్లో కేసు విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. దుకాణానికి సమీపంలోని సీసీ కెమెరా పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నారాయణ